క్లుప్తంగా

వైఎస్సార్ బీమా అందజేత



బీమా అందజేస్తున్న కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేట తీర ప్రాంతానికి చెందిన గరికిన లక్ష్మణరావు ఇటీవల వేటకు వెళ్లి మృతి చెందాడు. ఆయనకు వైఎస్సార్ బీమా వర్తించడంతో గురువారం ఆయన భార్య గరికిన అమ్మాజీకి వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు తక్షణ సహాయం రూ. 10 వేలు అందజేయగా మిగిలిన రూ.4 లక్షల 90 వేలు బ్యాంకు అకౌంటులో జమ అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దూడ అచ్చారావు, మేరుగు చిన్నారావు, వాసుపల్లి నర్సింగరావు, దూడ కొండబాబు, వాసుపల్లి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి ఆర్థిక సాయం



యువకుడి తల్లి కొండమ్మకు రూ.10 వేలు అందిస్తున్న శ్రీరామచంద్రమూర్తి

భీమునిపట్నం: ప్రమాదంలో గాయపడ్డ యువకుడికి భీమిలిలోని కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ గురువారం ఆర్థిక సాయం అందించింది. విజయనగరం భోగాపురానికి చెందిన నిరుపేద యువకుడు నత్తూరు హేమంత్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి యువకుడి తల్లి నత్తూరు కొండమ్మకు రూ.పదివేలు అందించారు.

పూరిల్లు దగ్ధం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్1వ వార్డు శ్రీనగర్‌లో గురువారం సాయంత్రం ప్రమాదవశాత్తూ నిడిగట్టు రాజుకు చెందిన పూరిల్లు దగ్ధమైంది. విషయం తెలుసుకున్న చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ సిబ్బంది సరఫరాను నిలిపివేశారు. అగ్నిమాపక వాహనం రావడానికి సరైన మార్గం లేకపోవడంతో జాతీయ రహదారి వద్దే నిలిచిపోయింది. దీంతో స్థానికులే బోరుబావి నీటితో మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.30వేల ఆస్తి నష్టం జరిగినట్టు ప్రాథమిక విచారణలో తేలింది.

చిరస్మరణీయుడు ఎన్‌టీఆర్

కొమ్మాది: పేదల సంక్షేమం కోసం దివంగత ఎన్‌టీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చారని జీవీఎంసీ 4వ వార్డు టీడీపీ నాయకుడు గరికిన కింగ్ అన్నారు. గురువారం మంగమారిపేటలో నందమూరి తారకరామారావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

మాట మీద నిలబడే నాయకుడు జగన్



సచివాలయ సిబ్బంది, జోనల్ కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

- హామీలన్నీ నెరవేర్చిన ముఖ్యమంత్రి
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- భగవాన్‌దాస్ కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం



బక్కన్నపాలెంలో లబ్ధిదారులకు సంక్షేమ బావుటా పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ: మాట మీద నిలబడడం..ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవడమే హీరోయిజమని, ఆ హీరో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. గురువారం సాయంత్రం జీవీఎంసీ 6వ వార్డు బక్కన్నపాలెం ఎన్టీఆర్ కాలనీలో ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. సమస్యలు పరిష్కారానికి భరోసా ఇచ్చారు. వారికి ప్రభుత్వం ద్వారా జరిగిన మేలుకు సంబంధించి సంక్షేమ బావుటా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం హయాంలో రాష్ట్రంలో కేవలం 30 లక్షల పెన్షన్లు ఉంటే రూ.500 కోట్లు ఖర్చు చేసేవారని, ఇప్పుడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 68 లక్షలు పెన్షన్లకు రూ.2వేల కోట్లు ఖర్చు చేస్తున్నారని చెప్పారు. ఇప్పటి వరకు మొత్తంగా రూ.83 వేల కోట్లు కేవలం పెన్షన్లు కోసమే కేటాయించారన్నారు. కాలనీలో నిర్మాణం చేసిన డ్రైనేజికి ఔట్‌లెట్ ఇవ్వాలని, స్థల వివాదం కోర్టులో ఉండడంతో ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలని స్థానికులు కోరారు. పార్కు స్థలానికి ప్రహరీ నిర్మాణం చేసి ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని, సీసీ రోడ్లు నిర్మాణం తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి పలువురు తీసుకువచ్చారు.

అసంపూర్తి వివరాలపై ఆగ్రహం

చంద్రబాబు నాయుడు రూ. 10 వేలు ఇస్తే రూ.50వేలు ఇచ్చినట్టు గొప్పలు చెప్పుకునే వాడని, ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి కుటుంబానికి లక్షల్లో మేలు చేస్తున్నామని ముత్తంశెట్టి అన్నారు. అయితే ఈ మేలును ప్రజలందరికీ వివరించే బాధ్యత అందరూ తీసుకోవాలన్నారు. ఇంటింటికీ పంపిణీ చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ కరపత్రాల్లో గత ఏడాది వరకు ప్రజలు పొందిన లబ్ధి వివరాలు మాత్రమే ముద్రించడంపై అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాలు ఎందుకు అప్‌డేట్ చేయలేదని సచివాలయ సిబ్బంది, పర్యవేక్షణ సక్రమంగా చెయ్యని జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ డాక్టర్ ముత్తంశెట్టి ప్రియాంక, జోనల్ కమిషనర్ కె.కనక మహాలక్ష్మి, ఏఈ సురేష్, వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, సీనియర్ నాయకుడు, సచివాలయ కన్వీనర్ రాయిన సాయి, అవతార్ సింగ్, 7వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, వరలక్ష్మి, అప్పారావు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్ అందజేత



క్రికెట్ కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పద్మనాభం: ఆడుదాం ఆంధ్రాలో మండల స్థాయి క్రికెట్ క్రీడా పోటీల్లో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్న కోరాడ క్రికెట్ టీమ్‌కు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు క్రికెట్ కిట్‌ను గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, భీమునిపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచలి సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, వైస్ ఎంపీపీ ఈర్ల రాజేశ్వరి, ఎంపీడీవో ప్రభాకరరావు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రజల చెంతకే వైద్య సేవలు



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న నాయకులు

మధురవాడ: ప్రజల చెంతకే జగనన్న సురక్ష వైద్య సేవలు అందుతున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతరావు పిలుపు నిచ్చారు. గురువారం జీవీఎంసీ 5వ వార్డు 68వ వార్డు సచివాలయం పరిధి స్వతంత్రనగర్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జగనన్న సురక్ష 2.0 ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలువురు వైద్యులు పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పోతన సురేష్, జీఎస్‌రెడ్డి, పి. చంద్రశేఖర్, జయ, అప్పారావు, శేఖర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం

అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



పద్మనాభం మండల సర్వ సభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

పద్మనాభం: పద్మనాభం మండలంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఎంపీపీ కంటుబోతు రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తక్షణమే ప్రతి లేఅవుట్‌లోను 80 శాతం జగనన్న కాలనీల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసేలా లబ్ధిదారులను చైతన్యవంతం చేయాలని తెలిపారు. అసంపూర్తిగా ఉన్న సచివాలయ భవనాల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రోడ్లకు గుంతలు పూడ్చేందుకు సంబంధిత శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. వేసవి కాలం సమీపిస్తున్నందున తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. సచివాలయ సిబ్బందితో, వివిధ శాఖల అధికారులతో మూడు రోజులకొకసారి సమీక్ష నిర్వహించాలని ఎంపీడీవో ప్రభాకరరావును ఎమ్మెల్యే ఆదేశించారు. గత ఐదేళ్ల టీడీపీ పాలనలో ఎమ్మెల్యే ఒక్క సర్వసభ్య సమావేశానికి కూడా రాలేదన్నారు. తాను ప్రతి సర్వ సభ్యసమావేశానికి వచ్చి ప్రజా ప్రతినిధుల ద్వారా సమస్యలు తెలుసుకుని పరిష్కరించినట్టు తెలిపారు. 25 మంది గర్భిణులు ఉంటేనే రేవిడి పీహెచ్‌సీలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తామనడం సరికాదని రేవిడి ఎంపీటీసీ సభ్యుడు సీర సూరప్పడు సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఎంపీపీ కంటుబోతు రాంబాబు మాట్లాడుతూ అటువంటి నిబంధన లేకుండా వచ్చిన వారికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయాలని రేవిడి పీహెచ్‌సీ వైద్య అధికారులను ఆదేశించారు. గంధవరం సర్పంచ్ జి.వి.కె.కె.వర్మ, రెడ్డిపల్లి ఉప సర్పంచ్ సిరుగుడి ఆదినారాయణ మాట్లాడుతూ ఇళ్లపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్లను మార్చాలని పలు మార్లు కోరినప్పటికీ విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ విద్యుత్ లైన్లను మార్చాలని ఎమ్మెల్యే విద్యుత్ అధికారులను ఆదేశించారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జెడ్పీ వైస్‌చైర్మన్ సుంకర గిరిబాబు, భీమునిపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచలి సూర్యనారాయణ, వైస్ ఎంపీపీ ఈర్ల రాజేశ్వరి, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, ఎంపీడీవో ప్రభాకరరావు, తహసీల్దార్ కె.వేణుగోపాల్, ఎంఈవో పి.రమణ, రెడ్డిపల్లి పశు వైద్యాధికారి ఆర్.శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దర్శకుడు గోపాలకృష్ణకు సత్కారం




గోపాలకృష్ణను సత్కరిస్తున్న సీఐ రమేష్, ఇరత పెద్దలు



నృత్యాన్ని ప్రదర్శిస్తున్న బాలికలు

భీమునిపట్నం: భీమిలిలోని కళా సాహితి సంస్థ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం సినీ దర్శకుడు ఎన్.గోపాలకృష్ణను సత్కరించారు. కళా సాహితి అధ్యక్షుడు పి.రాజేంద్ర ప్రసాద్‌వర్మ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సీఐ డి.రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాసాహితి ఆధ్వర్యంలో మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. సినీ నటి జయసుధను వెండితెరకు పరిచయం చేసిన దర్శకుడు గోపాలకృష్ణను సత్కరించి గౌరవించడం అభినందనీయమన్నారు. దర్శకుడు గోపాలకృష్ణ మాట్లాడుతూ తాను పరిచయం చేసిన జయసుధ పెద్ద నటిగా ఎదిగి గొప్ప పేరు తెచ్చుకోవడం తనకు ఎంతో ఆనందంగాను, గర్వంగాను ఉందన్నారు. అప్పట్లో దర్శకత్వ విధానానికి ఇప్పటికీ చాలా తేడా ఉందన్నారు. సాంకేతికంగానే కాకుండా ఇతర అన్ని అంశాల్లోను ఎన్నో మార్పులు వచ్చాయన్నారు. కళాసాహితి చేపడుతున్న కార్యక్రమాలు చాలా బాగున్నాయని ప్రస్తుత రోజుల్లో ఇటువంటివి సమాజానికి ఎంతో అవసరమన్నారు. ఈ సందర్భంగా బాలికల సంప్రదాయ నృత్య ప్రదర్శన అందర్నీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో సంస్థ సభ్యులు అడిదం సన్యాసిరాజు, మునునూరి సూర్య శ్రీనివాస్, కాళ్ల సన్నీ, అడిదం కిశోర్ పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



కార్తీక్ మృతదేహం

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు ప్రాంతంలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జీవీఎంసీ 4వ వార్డు నేరెళ్లవలసకు చెందిన ఊళ్ల కార్తీక్ (25) తన తల్లిదండ్రులతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. తల్లిదండ్రులు కూలి పని చేస్తుండగా, కార్తీక్ కార్ డ్రైవర్‌గా, రాడ్ వైండింగ్ పనులు చేస్తుండేవాడు. కొన్ని నెలల నుంచి పనులు లేక ఖాళీగా ఉంటున్నాడు. ఏదో పని చూసుకోమని తండ్రి చెబుతుండేవాడు. రోజూ మాదిరిగానే తల్లిదండ్రులు గురువారం కూలి పనులకు వెళ్లగా కార్తీక్ మనసు బాగాలేదని ఇంట్లోనే ఉండిపోయాడు. గురువారం మధ్యాహ్నం తన తండ్రి వెంకటరావుకు ఫోన్ చేసి తాను చనిపోతానని కార్తీక్ చెప్పాడు. ఎంటువంటి నిర్ణయం తీసుకోవద్దని సాయంత్ర వచ్చి మాట్లాడతానని తండ్రి వారించాడు. సాయంత్రం తల్లిదండ్రులు పనులు ముగించుకుని ఇంటికి చేరుకున్నప్పటికే కార్తీక్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది గమనించిన వారు తలుపులు బద్దలుకొట్టి కార్తీక్‌ను స్థానికుల సాయంతో భీమిలి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భీమిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



బంగ్లామెట్ట సర్వీస్ రోడ్డులో రక్షణగోడ లేని కొండవాలు



చిప్పాడ రహదారిలో రక్షణగోడ లేని కొండవాలు

తగరపువలస: కొండవాలు ప్రాంతాలను ఆనుకుని రక్షణగోడలు లేక రహదారులపై రాళ్లు జారిపడుతుండటంతో వాహనదారులు, పాదచారులు బెంబేలెత్తిపోతున్నారు. జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు వేంకటేశ్వరమెట్ట, బంగ్లామెట్టల మధ్య నుంచి జాతీయరహదారి ఆ పక్కనే ఇరువైపులా సర్వీస్‌రోడ్డులపై తరచు కొండవాలు నుంచి గ్రావెల్, బండరాళ్లు రహదారిపై జారిపడుతున్నాయి. ఈ మార్గాలలో ప్రయాణించే వాహనాలు ఎక్కువగా ఉండటంతో ఎప్పుడు ఎలాంటి ముప్పు ముంచుకు వస్తుందోనని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే భీమిలి మండలం చిప్పాడ, పెదనాగమయ్యపాలెం, అన్నవరం తదితర పంచాయతీలకు రాకపోకలు సాగించే మార్గంలో గుడివాడ వద్ద కొండవాలు నుంచి కూడా తరచూ రాళ్లు, గ్రావెల్ వచ్చి రహదారిపై చేరుతోంది. ఈ మార్గంలో దివీస్ లేబరేటరీకి చెందిన వేలాది మంది ఉద్యోగులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఇలాంటి సమయంలో అనుకోని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అంటున్నారు. ఈ మార్గంలో కూడా గుడివాడ వద్ద కొండవాలు ప్రాంతంలో రక్షణగోడ నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

ఉపకార వేతనాల పంపిణీ



ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులతో దివీస్ యాజమాన్య ప్రతినిధులు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబరేటరీ యాజమాన్యం గురువారం తమ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో 9 పంచాయతీలకు చెందిన 73 మంది విద్యార్థులకు రూ.4.39 లక్షల ఉపకార వేతనాలు పంపిణీ చేసింది. 2022-23 విద్యా సంవత్సరంలో మార్కుల ఆధారంగా 8వ తరగతి నుంచి పీజీ వరకు విద్యార్థులకు వీటిని అందించారు. ఈ ప్రయోజనం పొందిన వారిలో చిప్పాడ, పెదనాగమయ్యపాలెం, అన్నవరం, టి.నగరపాలెం, మూలకుద్దు, తూడెం, గుడివాడ, చెరకుపల్లి, లింగాలవలస పంచాయతీలకు చెందిన వారు ఉన్నారు.

వీటిని పంపిణీ చేసిన వారిలో దివీస్ వైస్ ప్రెసిడెంట్లు సూర్రెడ్డి దేవేందర్, ఎల్‌వీ రమణ, జనరల్ మేనేజర్లు వైఎస్ కోటేశ్వరరావు, ఎం.ఎస్.ఎన్.రావు, సీఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్, ప్రతినిధులు ఎ.శ్రీనివాస్, నరసింహ, శేఖర్‌బాబు, బిందు, హరికృష్ణ తదితరులు ఉన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



ట్రోఫీ అందుకుంటున్న విజేతలు

కొమ్మాది: సంక్రాంతి సంబరాలు పురస్కరించుకుని జీవీఎంసీ 5వ వార్డు మారికవలసలో వారం రోజుల నుంచి జరుగుతున్న ఎంపీఎల్ (మారికవలస ప్రీమియర్ లీగ్) మండల స్థాయి క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. ఈ పోటీల్లో 6 జట్లు పాల్గొనగా ఎంపీఎల్ సూపర్ కింగ్స్ జట్టు విజేత కాగా, ఎంపీఎల్ లయిన్స్ రన్నర్‌గా నిలిచింది.

బీపీఎల్ క్రికెట్ పోటీలు..

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు బొట్టవానిపాలెం శివారులో బీవీపీ యువత ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న కొర్రాయి గోవిందరావు మెమోరియల్ బొట్టవానిపాలెం ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. ఈ పోటీల్లో 5 జట్లు హోరా హోరీగా తలపడ్డాయి. విజేతలుగా బీవీపీ హంటర్స్, రన్నర్‌గా బీవీపీ గేమ్ చేంజర్స్ జట్లు నిలిచాయి. విజేతలకు టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి లక్ష్మణరావు బహుమతులు అందజేశారు.

రోడ్డు మధ్యలో గోతులతో ప్రమాదాలు



రోడ్డు మధ్యలో ఉన్న పెద్ద గొయ్యి

ఆనందపురం: మండలంలోని వేములవలస, వెల్లంకి గ్రామాలను కలుపుతూ నిర్మించిన అనుసంధాన రోడ్డు శిథిలం కావడంలో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. రెండు గ్రామాలను కలుపుతూ ఆరు లేన్ల రహదారి సర్వీసు రోడ్డు ఉన్న దూరాభారం కావడం, ట్రాఫిక్ సమస్య ఎక్కువుగా ఉండడంతో పొలాల మధ్యలో నుంచి నిర్మించిన అనుసంధాన రోడ్డునే ఎక్కువుగా వినియోగిస్తున్నారు. వెల్లంకి పంచాయతీ పరిధిలో పలు పరిశ్రమలు ఉండడంతో బ్యాంక్ లావాదేవీలకు, మార్కెట్ అవసరాలకు చాలా మంది ఈ రూట్లోనే ప్రయాణిస్తుంటారు. కాగా రోడ్డుపై రాళ్లు తేలి ఉండడంతో నడవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు చాలా చోట్ల గోతులు పడ్డాయి. రోడ్డు మధ్యలో నిర్మించిన కల్వర్టు వద్ద రోడ్డు పూర్తిగా పాడై పెద్ద గొయ్యి ఏర్పడింది. అందులోకి మురుగునీటి కాలువ నీరు చేరడంతో మురుకు కూపంగా ఉంది. దీంతో ఈ రూట్లో ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు ఆ గోతులో పడి గాయాలు పాలవుతున్నారు. ఎంతో ఉపయోగకరంగా ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఆగి ఉన్న కారు దగ్ధం



ఆరిలోవ: హెల్త్ సిటీ పక్కన బీఆర్‌టీఎస్ సర్వీస్ రోడ్డులో ఆగి ఉన్న ఓ కారు గురువారం దగ్ధమైంది. వివరాలిలా ఉన్నాయి. ఈ రోడ్డులో ఓ కారు(టాటా వింగర్) మరమ్మతులకు గురికావడంతో ఏడాది నుంచి నిలిపి వదిలేశారు. ఇది ఎవరిదో తెలియదు. స్థానిక చిన్నారులు కొందరు గురువారం మధ్యాహ్నం ఈ కారు తలుపు తెరిచి లోపలికి వెళ్లి ఆడుకుంటున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో కారులో ఉన్న పిల్లలు భయంతో బయటకు వచ్చి పరుగులు తీశారు. పెద్ద మంటలు, దట్టమైన పొగ రావడంతో ఏం జరుగుతుందో తెలియక స్థానికులు ఆందోళనకు గురయ్యారు. కొందరు యువకులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఈలోగా యువకులు నీళ్లు చల్లి మంటలు అదుపుచేయడానికి ప్రయత్నించారు. ఇంతలో అగ్నిమాపక వాహనంతో సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని కారులో ఎగసి పడుతున్న మంటలను పూర్తిగా అదుపు చేశారు. అప్పటికే కారు అంతా దగ్ధమైంది. ఇదిలా ఉండగా పాడైన కారు నుంచి మంటలు ఎలా వచ్చాయో అనే దానిపై అగ్నిమాపక సిబ్బందికి కూడా స్పష్టత రాలేదు. పిల్లలు అగ్గిపెట్టెలు పట్టుకుని ఆడుకుంటూ పుల్లలు వెలిగించడం వల్లే కారులో సీట్లు కాలిపోయి మంటలు వ్యాపించినట్టు భావిస్తున్నట్టు కొందరు స్థానికులు తెలిపారు.